వెలుగు లేని సోలార్

- నియోజకవర్గంలో 16 గ్రామాల్లో వాటర్‌షెడ్ కింద ఏర్పాటు
- నిరుపయోగంగా మారిన సోలార్ లైట్లు
- వృథాగా రూ. లక్షల నిధులు

మరికల్: పల్లెల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సమయంలో వెలుగులు అందించేందుకు ఏర్పాటుచేసిన సోలార్ లైట్లు నిరుపయోగంగా మారాయి. వాటర్‌షెడ్ పథకం కింద మంజూరైన సోలార్ లైట్లను ప్రైవేట్ కంపెనీలు ఒప్పందం కుదుర్చుకొని గ్రామాల్లో ఏర్పాటు చేశారు. 2016లో నియోజకవర్గంలోని 16 గ్రామాల్లో 210సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ సరిగ్గా లేక గ్రామాల్లో ఒక్కటి రెండు మినహా ఎక్కడ వెలగడం లేదు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద, రహదారుల పక్కన వీటిని ఏర్పాటు చేశారు. కంపెనీ నిర్లక్ష్యంతో అవి వెలగడం లేదు. ప్రతి సోలార్ దీపం బ్యాటరీ పెట్టె వద్ద కంపెనీ పేరు, వారి ఫోన్‌నంబర్లు పొందుపరిచారు. వాటిని సంప్రదిస్తే ఎలాంటి స్పందన లేదు. నియోజకవర్గ అంతట ఇదే పరిస్థితి ఉందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం సైతం లైట్లను మరమ్మతుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.


ఎలిగండ్లలో వెలగని సోలార్ లైట్లు

సోలార్ లైట్లు ఏర్పాటుచేసిన గ్రామాల సంఖ్య

మండలం	గ్రామాలు	సోలార్ లైట్లు
మరికల్	3	40
ధన్వాడ	3	54
దామరగిద్ద	6	66
నారాయణపేట	4	50
మొత్తం	16	210

వృథాగా రూ. లక్షల నిధులు

నియోజకవర్గంలోని 16గ్రామాల్లో 210 సోలార్ లైట్లను వాటర్‌షెడ్ పథకం కింద ఏర్పాటు చేశారు. ఒక్కొక్క లైటుకు రూ. 15వేల ఖర్చు అవ్వగా మొత్తానికి రూ.31,50 లక్షల నిధులు ఖర్చు చేశారు. వీటిని ఏర్పాటుచేసి 8ఏళ్లు గడుస్తున్నా, కనీసం మరమ్మతు చేయడానికి కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు రాకపోవడంతో లక్షల ప్రభుత్వ నిధులు వృథావుతుంది.

మరమ్మతు చేయాలి..



తమ గ్రామంలో 12సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో లైట్లు మరమ్మతు చేసి కొన్నాళ్లు వెలిగించారు. నిధుల కొరత రావడంతో వాటిని మరమ్మతు చేయలేకపోయాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వృథా ఉన్నా సోలార్ లైట్లను మరమ్మతు చేసి వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

-దేవమ్మ, మాజీ సర్పంచ్, ఎలిగండ్ల

పట్టించుకోవడం లేదు..



ఎదైన సమస్యతో గ్రామంలో కరెంట్ పోతే చీకట్లోనే మగ్గుతున్నాం. తమ గ్రామంలో ఏర్పాటుచేసిన సోలార్ లైట్లు ప్రారంభంలో కేవలం రెండేళ్లు మాత్రమే వెలిగాయి. మరమ్మతుకు రావడంతో వాటిని ఎవరు పట్టించుకోవడం లేదు.

- హుస్సేన్, ఎలిగండ్ల

నిధుల మంజూరు కావాలి

జిల్లాలో వాటర్‌షెడ్ పథకం కింద ఏర్పాటుచేసిన సోలార్ లైట్ల మరమ్మతుకు నిధుల కొరత ఉంది. నిధులు మంజూరైన వెంటనే వాటిని మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

- సుధాకర్‌రెడ్డి, డీఎల్‌పీఓ, నారాయణపేట

కౢప్తంగా

విద్యార్థులకు అభినందన

మద్దూరు: ఆటలతో ఆరోగ్యం పెంపొందించబడుతుందని నిడ్జింత పాఠశాల హెచ్‌ఎం అంజనేయులు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఖోఖో క్రీడాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనబర్చిన వారికి అభినందించారు. వీరు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పీడీ కతలప్ప, ఉపాధ్యాయులు లాజర్, విజయరెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, నరేష్, బీమ్‌సేన్, దేవేంద్రప్ప పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి..

మద్దూరు: మండలంలోని చింతల్‌దిన్నె గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ శ్రీనివాస్‌ను ఇదే గ్రామానికి చెందిన రెడ్డిలు ముకుమ్మడి దాడిచేశారు. తీవ్రగాయాలైన శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహాయాదవ్, గొర్రెల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్న డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో పర్యటించి కూల్చివేసిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, కుర్మప్ప, సాయిలు, రాజగోపాల్, చందు, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు క్షమాపణ

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో ఈ నెల 18న జరిగిన సంఘటన చాలా హేయమైనది, ఇలాంటి ఘటనలను తాము వ్యతిరేకిస్తామని, హిందువులందరూ ఐక్యంగా ఉండాలని బ్రాహ్మణ సమాజం నాయకులు అమర్‌కుమార్ దీక్షిత్, రఘు ప్రసన్న భట్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ యాదవేంద్రస్వామి ఆలయ అర్చకుడు చక్రపాణి వ్యవహారం బాధించిందని, ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. అనంతరం చక్రపాణి మాట్లాడుతూ తాను దళితులకు భేషరతుగా క్షమాపణ చెబుతున్నానని, మరోమారు ఇలాంటివి పునరావృతం కానివ్వనని పేర్కొన్నారు. బ్రాహ్మణ సమాజం నాయకులు నారయాణ భట్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మక్తల్: మండలంలోని కాట్రెమ్‌పల్లికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఇటుక బట్టీలకు వెళ్లే లారీలతో రోడ్డు అధ్వానంగా తయారైందని మరమ్మతు చేపట్టాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు బుధవారం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్ర అందజేశారు.

ఆలయంలో మరమ్మతు

మరికల్: మండల కేంద్రంలోని కోట్ల ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో బుధవారం కాంక్రీట్‌తో మరమ్మతు పనులు చేపట్టారు. ఆలయ ఆవరణలో అపరిశుభ్రంగా ఉండటంతో దాతల సహకారంతో మరమ్మతులు చేశారు. ఈ నెల 31 స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

ధన్వాడ: మండల కేంద్రంలోని బుధవారం సంతా బజార్ పాఠశాలను మండల నోడల్ ఆఫీసర్ గాయత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని తరగతి గదులను పరిశీలించారు. ఈ మేరకు.. విద్యార్థులను పాఠ్యాంశంలోని పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోని ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు.

రిజర్వాయర్లను సందర్శించిన అధికారులు

మక్తల్: నియోజకవర్గంలో ఉన్న సంగంబండ, భూత్పుర్ రిజర్వాయర్లను సీడబ్ల్యూసీ డైరెక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ శరణ్య బుధవారం సందర్శించారు. అనంతరం రిజర్వాయర్ల వద్దకు వెళ్లి సంబంధిత అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఏఈ నాగశివ, ఇరిగేషన్ అధికారులు తదితరులు ఉన్నారు.

విద్యుత్‌శాఖ సీఎండీకి వినతి

నారాయణపేట: జిల్లా కేంద్రానికి బుధవారం విద్యుత్ ఎస్ఈ కార్యాలయ పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ అలీకి జిల్లా కేంద్రంలో ఎస్ఈ కార్యాలయ భవనం, డిస్ట్రిక్ స్టోర్ ఏర్పాటుచేయాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు పోలేమాని కృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాంట్రాక్టర్లు కతాల్, శ్రీకాంత్, మోదీన్, అశోక్ గౌడ్, పాషా, సూరి ఉన్నారు.

పశుగణన పక్కాగా చేపట్టాలి

నారాయణపేట: జిల్లా వ్యాప్తంగా పశుగణను పక్కాగా చేపట్టాలని జిల్లా పశు పశుసంవర్ధశాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు 21వ పశుగణన చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఐదేళ్లకు ఒకసారి ఈ పశుగణన చేపడతారని, ఈసారి పశుగణ డిజిటల్ విధానంలో చేపట్టనున్నట్లు వివరించారు. జాతీయ స్థాయిలో ఒక అప్లికేషన్ రూపొందించినట్లు, జిల్లాలోని ప్రతి ఇంటికి వెళ్లి పశువుల యజమానుల వివరాలు, పశువుల సంఖ్య యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. 37 మంది ఎన్యుమరేటర్లు, 7 మంది సూపర్‌వైజర్లు నియమించడం జరిగిందన్నారు. జిల్లాలోని 13 మండలాల్లోని 280 గ్రామ పంచాయతీలు, మూడు మున్సిపాలిటీల్లోని 55 వార్డుల్లో పశు వైద్య సిబ్బంది పశుగణన చేపడుతున్నట్లు వివరించారు.



పాఠశాలకు కంప్యూటర్ వితరణ

కోస్గి: తాము చదువుకున్న పాఠశాలకు రూ.50 వేల విలువైన కంప్యూటర్‌ను అందించారు. పట్టణంలోని బహార్‌పేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1998బ్యాచ్ పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం కంప్యూటర్‌ను అందించారు. ఈ మేరకు పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లికార్జున్‌కు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందించాలనే లక్ష్యంతో పూర్వ విద్యార్థులతో కలిసి ఓ చారిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాలెం ప్రశాంత్, మూలింటి శంకర్, నవీన్‌కుమార్, సంతోష్ కుమార్ తోపాటు సీఆర్పీ బాల్‌రాజ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.


కంప్యూటర్ అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు

నర్వ: నేడు బీజేపీ సభ్యత్వ నమోదు మండల కేంద్రంలోని బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఫాంహౌస్‌లో నిర్వహిస్తున్నట్లు మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి రాంపూర్ నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం10:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూర్ భాస్కర్ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఇన్‌చార్జిగా ప్రసన్నరెడ్డి..

మక్తల్: నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా మక్తల్‌కు చెందిన ప్రసన్నరెడ్డిని బీజేపీ అధిష్టానం ఎంపిక చేసింది. బుధవారం సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంపిక చేయడంపై ఎంపీ డీకే అరుణకు, జిల్లా నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ నాయకుల సహకారంతో పనిచేసి, సభ్యత్వ నమోదు కార్యక్రమం అధిష్టానం నిర్ణయం మేరకు పనిచేస్తామన్నారు.

ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలుపర్చాలి

మద్దూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నిరంతరం ముందుంటుందని జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం సంఘం రాష్ట్ర నాయకుడు నర్సప్ప, సంఘం సభ్యులతో కలిసి మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ఉమ్మడీ సర్వీస్ రూల్స్ అమలు పరిచి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని, 317జీఓ బాధితులకు వెంటనే న్యాయం చేయాలన్నారు. కృష్ణమూర్తి, వెంకట్‌రాంరెడ్డి, మల్లేష్, శేఖర్, రవీందర్, రాజశేఖర్, స్వప్న, ప్రణీత, హరిచందన, బసంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊట్కూరు: ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేసి న్యాయం చేయాలని తపస్ జిల్లా నాయకులు నర్సింగప్ప కోరారు. బుధవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో తపస్ సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు తపస్ సంఘం ముందుంటుందన్నారు. నూతన పీఆర్‌సీ అమలు చేయాలని, జీఓ 317ను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కిరణ్, కృష్ణ, గోపాల్, వెంకటయ్య, అంబిక, లక్ష్మి, రాజశ్రీ పాల్గొన్నారు.


పల్లెర్లలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాగనూర్: సీజనల్ వ్యాధులపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి నాగజ్యోతి అన్నారు. బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియ, చికెన్ గున్యా వ్యాధుల పరీక్షలు ఉచితంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోనే నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షలకు అవసరమైన కిట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ ఆస్పత్రిలో గానీ ల్యాబోరెటరీ, డయాగ్నోస్టిక్ సెంటర్స్ వద్ద రోగి బ్లడ్ శాంపిల్ నిర్ధారణకు స్థానిక పీహెచ్‌సీకి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్‌టెక్నీషియన్ రాఘవేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

మక్తల్: మక్తల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ పెద్ద కుమారుడు అమృతగౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం నిర్వహించిన దశదిన కార్యక్రమంలో అమృతగౌడ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ధైరయం చెప్పారు. కార్యక్రమంలో బీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, దేవరి మల్లప్ప, రవికుమార్ యాదవ్, గణేష్‌కుమార్, సురేష్, గోవర్ధన్‌రెడ్డి, కర్ని స్వామి, రాజశేఖర్‌రెడ్డి, తాయప్ప, మహిపాల్‌రెడ్డి, రహీం పటేల్ తదితరులు పాల్గొన్నారు.


అమృతగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తదితరులు

లక్ష బిల్వార్చనకు ఏర్పాట్లు

మరికల్: మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి సమేత ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించే లక్ష బిల్వార్చన మహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జగదీష్ తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, శ్రీహరితోపాటు పీఠాధిపతులు హాజరవుతున్నారన్నారు. భక్తులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యాసామర్థ్యాలు పెంచేలా కృషిచేద్దాం

ఊట్కూరు: విద్యా సామర్థ్యాలను పెంచేవిధంగా కృషి చేద్దామని ట్రైనీ కలెక్టర్ గరిమనరుల అన్నారు. బుధవారం మండలంలోని బాలికల ఉన్నతపాఠశాల, ఉర్దూమీడియం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆంగ్ల పాఠ్య పుస్తకాలలో ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలో విద్యా సామర్థ్యాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం ఉన్నత విద్యార్థుల ప్రగతికోసం లీప్ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, హెచ్‌ఎం మాధవి, కుసుమ, ప్రేమకుమారి తదితరులు పాల్గొన్నారు.


జవాబులు రాబడుతున్న ట్రైనీ కలెక్టర్

ఆర్టీసీ బస్ సర్వీసులను పెంచాలి

నారాయణపేట రూరల్: ఆర్టీసీ బస్ సర్వీసులను పెంచి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాన్ని అందించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. పీఓడబ్ల్యు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్టీసీ సంస్థవారు వివిధ డిపోల పరిధిలో ప్రజలకు తగినన్ని బస్ సర్వీసులు కేటాయింపులు చేపట్టకపోవడంతో కొన్నిచోట్లకు నడుపుతున్న సర్వీసులను కూడా తగ్గించారని విమర్శించారు. డిపో పరిధిలోని పలు గ్రామాలకు పల్లె వెలుగులు కేటాయించాల్సిన అవసరం ఉందని, మరికొన్ని రూట్లలో సర్వీస్ ట్రిప్పులను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సునీత, సత్తెమ్మ మంజుల, కాశీనాథ్, కెంచె నారాయణ, ప్రశాంత్, నరసింహ, సాయికుమార్, వెంకటేష్, సురేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.


సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు

నోడల్ అధికారుల నియామకం

నారాయణపేట రూరల్: కోర్టు కేసు కారణంగా విద్యాశాఖలో ఎంఈఓల నియామక ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోవడంతో పాఠశాలల పర్యవేక్షణ కుంటుబడింది. దీంతో ప్రభుత్వం కొత్త పేరుతో మండల పర్యవేక్షణ అధికారుల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మండల నోడల్ అధికారులు (ఎంఎన్ఓ)లను ఏర్పాటు చేస్తూ బుధవారం సాయంత్రం డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మండలాల్లో సీనియర్ జీహెచ్ఎంల పేర్లతో తొలుత జాబితా సిద్ధం చేయగా ఒకరిద్దరు నాట్ విల్లింగ్ ఇవ్వడంతో వారి స్థానంలో మరో సీనియర్ జీహెచ్ఎంకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా క్వాలిటీ కంట్రోలర్‌గా వ్యవహరిస్తున్న ఏఎంఓ విద్యాసాగర్ వీరిని సమన్వయ పరిచే బాధ్యతను అప్పగించారు.

నోడల్ అధికారులు వీరే..

జిల్లాలోని అన్ని మండలాలకు సీనియర్ జీహెచ్‌ఎంలతో ఎంఎన్‌ఓలను నియమించారు. దామరగిద్దకు సత్యనారాయణ (క్యాతన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్), ధన్వాడకు గాయత్రి, గుండుమాల్‌కు శేఖర్‌రెడ్డి, కోస్గికి శంకర్‌నాయక్, కొత్తపల్లికి ఆంజనేయులు (నిడ్జింత జెడ్పీ స్కూల్), కృష్ణకు నిజాముద్దిన్ (ముడుమాల్ జెడ్పీహెచ్‌ఎస్), మద్దూర్‌కు బాలకిష్టప్ప (పెదిరిపాడ్ జెడ్పీ స్కూల్), మాగనూర్‌కు మురళీధర్‌రెడ్డి, మక్తల్‌కు అనిల్‌గౌడ్, మరికల్‌కు మనోరంజని, పేటకు బాలాజీ (బొమ్మన్‌పాడు జెడ్పీస్కూల్), నర్వకు రామకృష్ణ, ఊట్కూర్‌కు రామచంద్రచారి (చిన్నపొర్ల జెడ్పీహెచ్‌ఎస్)కి అప్పగించారు. ఈ మేరకు గురువారం హైద్రాబాద్‌లో జరిగే శిక్షణకు హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

నారాయణపేట:ప్రభుత్వం రైతులకు ఆంక్షలు లేకుండా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వ్యవసాయఅధికారి జాన్ సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు.. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నింటితో పాటు అన్ని విధాలా తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం, కార్మిక, విద్యార్థి సంఘం నాయకులు చెన్నారెడ్డి, కృష్ణ, నర్సింహులు, నారాయణ, బాలకృష్ణ, చంద్రాములు, రాజు, తాయప్ప, ప్రశాంత్, వెంకట్రాములు, చెన్నప్ప, రాములు, అంజి, సాయికుమార్ పాల్గొన్నారు.

దామరగిద్ద: అర్హులందరికీ ప్రభుత్వం రుణమాఫీ వర్తింపచేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మండల అధ్యక్షుడు తాయప్ప డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి హరితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి మధు, పీడీఎస్‌యూ మహేష్, బాల్‌రాజ్, నారాయణమ్మ, రాజు, అజయ్, కవిత తదితరులు పాల్గొన్నారు.


పేటలో డీఏఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పాఠశాలల అభివృద్ధికి కృషి

నారాయణపేట: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి హెచ్‌ఎంలు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం డీఈఓ, హెచ్‌ఎంలతో వీసీ నిర్వహించారు. పీఎంశ్రీతో జిల్లాలో మొదటి విడత 12పాఠశాలలు, రెండో విడత ఏడు పాఠశాలలు ఈ పథకం కింద ఎంపికకాబడ్డాయని తెలిపారు. ఈ పాఠశాలలను ఆరు సంవత్సరాలలో విడతలవారీగా అన్నివిధాల అభివృద్ధి పనులు చేస్తారని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి హెచ్‌ఎంలు వార్షిక ప్రణాళిక తయారు చేసుకుని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ ఎండీ ఘని, శ్రీనివాస్, విద్యాసాగర్, రాజేందర్, పద్మనాళిని, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో వేరుశనగ విత్తనాలు

దామరగిద్ద: మండలంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో వేరుశనగ (కే6 రకం) విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి హరిత తెలియజేశారు. ప్రభుత్వం తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వనపర్తి నుంచి సరఫరా చేసిందని, 30కిలోల బస్తా రూ. 3046.50లకు అందజేస్తున్నట్లు తెలిపారు. యాసంగి సాగుకు విత్తనాలు అవసరమైన రైతులు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సంప్రదించి తీసుకెళ్లాలని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా..

నారాయణపేట: తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా అందించే పథకాలను ప్రైవేట్ ఇన్స్‌రెన్స్ కంపెనీలకు అప్పజెప్పొద్దని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపాల్ పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల నుంచి వచ్చే దరఖాస్తులను చిన్న చిన్న కారణాలతో తిరస్కరించి బోర్డులో జమ అయినా డబ్బులు ఖాజేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఇచ్చే బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసీల్దార్ అమరేందకు అందజేశారు. ధర్నాలో నాయకులు వెంకట్రాములు, బాలయ్య, శంకర్ తదితరులు ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతి అందిస్తున్న నాయకులు

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన


పేటలో నవగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం దర్శించుకుంటున్న భక్తులు


మద్దూర్‌లో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా కొనసాగింది. అదేవిధంగా వినాయక విగ్రహం, నవగ్రహాలు, ఆలయానికి ఇరువైపులా ద్వారపాలకుల ఏర్పాటును వేద బ్రహ్మణుల చేత ప్రతిష్ఠాపన చేశారు. వార్డు కౌన్సిలర్ నారాయణమ్మ, జిల్లా కాంగ్రెస్ యువ నాయకులు చిట్టెం అభినవ్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

యజ్ఞం యాగాలతోనే ముక్తికి మార్గం

యజ్ఞం యాగాలు చేయడంతో సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పుష్కలంగా పండి దేశం సుభిక్షంగా ఉంటుందని ఆర్యసమాజ్ ప్రతినిధి సభ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్య అన్నారు. పట్టణంలోని ఆర్యసమాజ మందిరంలో మూడురోజుల పాటు కొనసాగిన శ్రావణ మహాయజ్ఞంలో ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు.. వేద ప్రచారకులు పండిట్ ప్రియదత్ శాస్త్రి వేదమంత్రాలతో యజ్ఞం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో బజరంగ్ దళ్ యువజన సంఘం ఆధ్వర్యంలో రెండురోజులపాటు కొనసాగిన ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కుంటిమారి నర్సింహులు నేతృత్వంలో వేదాపండితులు మంత్రోచ్చరణాల మధ్య బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహించారు.ఆయా కార్యక్రమాల్లో ఆర్యాసమాజ్ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ సరోదే, మంత్రి నాగమ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకిషన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, డాక్టర్ గీత విశ్వనాథ్, డీపీఎం స్కూల్ హెచ్‌ఎం కె నారాయణ, సాయిలు, రాజు వెంకటప్ప, అంజప్ప, రాములు, దత్తు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని గీతాంజలి పాఠశాల సమీపంలో నిర్మించిన సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈమేరకు.. వేద పండితులు రాఘవ శర్మ బృందం ఉదయం సాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయం చుట్టూ స్వామివారి పల్లకిసేవా నిర్వహించారు. మల్లికార్జున్, సిద్దిలింగం, గోవర్ధన్, నర్సింహ, వెంకటేష్ పాల్గొన్నారు.

మహాద్వారానికి భూమి పూజ

కృష్ణా: మండలంలోని మహాద్వారంతోపాటు బొడ్రాయి ఏర్పాటుకు బుధవారం గ్రామస్తులు భూమి పూజ నిర్వహించారు. ఈ మేరకు.. నాయకులు మాట్లాడుతూ గ్రామానికి ప్రతిరోజు వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడకి వస్తుంటారని, వారికి ఆహ్వానించే విధంగా ముఖద్వారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ మహాదేవ్, నాయకులు సంగప్పగౌడ, శంకర్, నాగేష్, కృష్ణ, తాయప్పగౌడ్, అర్చకులు గిరిష్‌జోషి తదితరులు పాల్గొన్నారు.